## క్లుప్తంగా

### మర్యాదపూర్వక కలయిక



జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం జిల్లా పాలకొండ పర్యటన అనంతరం విశాఖ ఎయిర్‌పోర్టు లాంజ్‌లో పార్టీ ముఖ్య నేతలను కలిసేందుకు విచ్చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని శ్రీధర్ కండువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై జగన్‌తో చర్చించనట్లు శ్రీధర్ తెలిపారు.

### గ్రైస్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గ్రైస్) విద్యార్థులు అత్యధిక సంఖ్యలో ఉద్యోగాలు సాధించారు. వీల్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ తమిళనాడులో ఉద్యోగాల నియామకానికి సంబంధించి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఈ కాలేజీకి చెందిన 20 మంది విద్యార్థులు ఎంపికైనట్లు గ్రైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. డిప్లమా ఇంజినీర్ ట్రైనీ ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.3.25 లక్షలు, ట్రైనీ డిప్లమా టెక్నీషియన్ ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.2.50 లక్షలు వార్షిక ప్యాకేజీ ఇస్తారన్నారు. వీరిలో పెట్రో కెమికల్స్ నుంచి ఐదుగురు, కెమికల్ విభాగానికి చెందిన 15 మంది ఉద్యోగాలు సాధించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ, విభాగాధిపతి డాక్టర్ ఎం.విజయలక్ష్మి, అసిస్టెంట్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి కుమార్, కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ ఎ.దివాకర్ పాల్గొన్నారు.

### రోడ్లపై వాకింగ్‌తో ప్రమాదాలు

మురళీనగర్ : రహదారుల్లో నడవడం ద్వారా కోరి ప్రమాదాలు తెచ్చుకోవద్దని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్ అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'నడవండి – నడిపించండి' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంతనే పచ్చని ఆరోగ్యకరమైన వాతావరణం కలిగిన పార్కులు అందుబాటులో ఉన్నప్పటికీ చాలా మంది రహదారులపై వాకింగ్ చేస్తున్నారని, దీని వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. వాకర్స్ పార్కులో నడిచేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించామని, వాకర్స్ ఇక్కడి పార్కులో నడవాలని కోరారు. క్లబ్ కార్యదర్శి చొల్లంగి ప్రసాద్ సహకారంతో వాకింగ్‌లో పాల్గొన్న వారికి ఉడకబెట్టిన గుడ్డు, అరటిపండు అందించారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్ – 101 గవర్నర్ కె.ద్వారకానాథ్, ఆర్‌సీ – 5 ఉప్పలపాటి శుభ, వాకర్స్ క్లబ్ కార్యదర్శి చొల్లంగి ప్రసాదరావు, ఉపాధ్యక్షురాలు జి.విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి నానుపాత్రుని ప్రకాశరావు, కోశాధికారి రోణంకి నాగేశ్వరరావు, ఎల్‌వీ సుధాకర్ పాల్గొన్నారు.

### రైతుల నుంచి సేకరించి.. టమాటాల విక్రయాలు



ఎంవీపీ రైతుబజార్‌లో వినియోగదారులకు టమాటాలు విక్రయిస్తున్న వ్యాపారి

ఆరిలోవ: మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో రైతుబజార్లలో సభ్యత్వం లేని జిల్లాల్లో రైతుల వద్ద టమాటాలు సేకరిస్తున్నారు. వాటిని రైతుబజార్లలో విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా కొత్తూరులో ఓ రైతు నుంచి 9.50 క్వింటాళ్ల టమాటాలు సేకరించి గురువారం ఎంవీపీ రైతుబజార్‌కు తీసుకువచ్చారు. ఇక్కడ వాటిని వినియోగదారులకు రైతుబజార్‌లో నిర్ణయించిన (గురువారం టమాటా కిలో రూ.11) ధరకు విక్రయించినట్లు ఈవో వరహాలు తెలిపారు. పొలంలో పండించే రైతు వద్దకే వెళ్లి సేకరించినవన్నారు. రైతుబజార్ సహాయకుడు కనకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# జ్వరాలతో జాగ్రత్త



రోగితో మాట్లాడుతున్న ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శశి ప్రియాంక

విజృంభిస్తున్న సీజనల్ జ్వరాలు

పరీక్షల కోసం ఆరోగ్య కేంద్రాలకు రోగుల క్యూ

అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



రక్త పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



ల్యాబ్‌లో నమూనాలు టెస్ట్ చేస్తున్న టెక్నీషియన్

| ఆర్‌బీపేట యూపీహెచ్‌సీలో జరిగిన పరీక్షలు.. వ్యాధుల నిర్ధారణ | |
|---|---|
| పది రోజులుగా చేసిన పరీక్షలు | 157 |
| మొత్తం జ్వర పీడితులు | 132 |
| మలేరియా వ్యాధిగ్రస్తులు | 57 |

కంచరపాలెం: శీతాకాలం నుంచి వేసవిలోకి వాతావరణం మారడంతో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. దగ్గు, జలుబు, జ్వరాల బారిన పడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మరోవైపు వింత వ్యాధి నగరంలో ప్రబలిందనే ప్రచారం జోరుగా ఉండడంతో చిన్న పాటి జ్వరాలకే ప్రజలు వణికిపోతున్నారు. దీంతో కంచరపాలెం పరిధిలో గల రామ్మూర్తిపంతులుపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)కి వరుగులు తీస్తున్నారు. వాతావరణ మార్పుల వల్ల వైరల్ జ్వరాలు వ్యాపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఇవి వయసుతో సంబంధం లేకుండా వ్యాప్తి చెందుతాయని, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.

**వైద్య పరీక్షలకు క్యూ..**

సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో కంచరపాలెం పరిధిలో గల దయానందనగర్, చాకలిగెడ్డ, రాజీవ్‌కాలనీ, పైడిమాంబకాలనీ, ముత్యమాంబ కాలనీ, ఆర్పీపేట, గవర కంచరపాలెం, తోట వీధి, దుర్గానగర్, గొల్లకంచరపాలెం, గోకుల్‌నగర్, గౌరీనగర్ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 80 నుంచి 95 మంది వరకు ఆర్పీపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)కి వస్తున్నారు. వారిలో రోజుకు కనీసం 9 నుంచి 15 మంది వరకు జలుబు, దగ్గు, జ్వరం బాధితులని తేలుతోంది. ఈ నేపథ్యంలో రక్తపరీక్షల కోసం రోగులు క్యూ కడుతున్నారు. రోగ నిర్ధారణ అయితే మందులు అందజేస్తున్నామని పీహెచ్‌సీ వైద్య సిబ్బంది చెబుతున్నారు.

**ఎండలతో అవస్థలు..**

ఫిబ్రవరి నెలకే ఎండల తీవ్రత పెరిగి అనేక రకాల వ్యాధులు విజృంభిస్తుండటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ కాలంలో సాధారణంగా జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి, ఫ్లూ వంటి వ్యాధులు సంభవిస్తాయి. వీటితో పాటు పలు అంటు వ్యాధులు, కంటి వ్యాధులే కాకుండా ఆస్తమా, సీవోపీడీ, ఎలర్జీ, బ్రాంకైటిస్, న్యూమోనియా వంటి శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ దశలో వైరల్ జ్వరాలపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. శరీరంలో ఉష్ణోగ్రత స్థాయి ఎక్కువగా ఉండడంతో జ్వరంతో పాటు జలుబు, దగ్గు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు తరచు జలుబు, దగ్గుతో ఇబ్బంది పడుతుంటారు. అదే విధంగా ఈ సీజన్‌లో చాలా మందిని ఇబ్బంది పెట్టే ప్రధాన సమస్యల్లో గొంతునొప్పి ఒకటి. సీజన్ మారే సమయంలో చాలా మందికి ముందుగా గొంతునొప్పి వస్తుంది. గొంతులో ఇన్‌ఫెక్షన్ కారక సూక్ష్మ జీవులు చేరడం వల్ల నొప్పి మొదలవుతుంది. గొంతులో గురకగా ఉండంతో ఆకలి సరిగా ఉండదు. ఎడతెరిపిలేని దగ్గు వేధిస్తుంది.

**సీజనల్ వ్యాధులతో అప్రమత్తం..**



మారుతున్న సీజన్‌ను బట్టి వ్యాధులు ప్రబలడం సహజం. దోమలు పెరగడంతో విష జర్వాలు పెరిగే అవకాశం ఉంది. జ్వరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి. పిల్లలపై ప్రతి పేరెంట్ దృష్టి సారించాలి. నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించాలి. శీతలం నుంచి ఉష్ణంలోకి వాతావరణం మారడం వల్ల పలు జ్వరాలు వస్తాయి. కంగారు పడకుండా సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో జ్వర పీడితులు పరీక్షలు చేయించుకుని తగు వైద్యం తీసుకోవాలి. క్రమం తప్పకుండా మందులు వాడితే ఏ సమస్య ఉండదు.

– డాక్టర్ మట్టా శశిప్రియాంక, ప్రధాన వైద్యాధికారి, ఆర్పీపేట యూపీహెచ్‌సీ, కంచరపాలెం

## వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ అధ్యక్షుడిగా గంగరాజు



యర్ర గంగరాజు



సర్వసిద్ధి సాయిలత

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడిగా 92వ వార్డుకు చెందిన యర్ర గంగరాజును పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. అలాగే జిల్లా అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా 56వ వార్డుకు చెందిన సర్వసిద్ధి సాయి లతను నియమించారు. తమకు కీలక పదవులు ఇచ్చిన జగనన్నకు, నియోజకవర్గ సమన్వయ కర్త మళ్ల విజయప్రసాద్‌కు గంగరాజు, సాయిలత కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## రక్తదానంతో ఆరోగ్యం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలో ఉన్న శ్రీపాద డిగ్రీ కాలేజీ, ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ మేరకు గురువారం కాలేజీ సెమినార్ హాల్లో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రాజేష్, ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ డాక్టర్ సుగంధి, అరుణ రక్తదాన ప్రయోజనాలు వివరించారు. కాలేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుబజార్ రహదారి పరిశుభ్రం



రైతుబజార్ ప్రహరీని ఆనుకుని ఉన్న చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

గోపాలపట్నం: స్థానిక రైతుబజార్ ప్రహరీని ఆనుకుని ఉన్న దుకాణాల వద్ద చెత్తను జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. గత కొన్నేళ్లుగా ఇక్కడి ప్రహరీని ఆనుకుని ఉన్న దుకాణాల వద్ద భారీగా చెత్త పేరుకుపోయింది. ఇక్కడి వ్యాపారులే చెత్త ఇక్కడ పడేస్తున్నారు. ఆ చెత్త పైనే బల్లలు పెట్టుకుని దుకాణాలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం ఈ దుకాణాలను తొలగించి చెత్తను టిప్పర్లలో ఎక్కించి శుభ్రం చేశారు.

**రహదారిపై చెత్త వేస్తే కఠిన చర్యలు..**

ఈ రహదారిలో ఆస్పత్రులు ఉన్నాయి. నిత్యం అంబులెన్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వాటికి అడ్డంకి లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని శానిటరి కార్యదర్శి తేజ వ్యాపారులను హెచ్చరించారు. అంతే కాకుండా ప్లాస్టిక్ సంచులు, వాడరాదని పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్త తొలగింపుతో ఈ ప్రాంతమంతా బాగుపడడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకి ఇరువైపులా దుకాణాలు పెట్టకుండా అంతా ఒకవైపు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రైతుబజార్ సమీపంలో వాహనాల పార్కింగ్‌తో ఏర్పడుతున్న ఇబ్బందులను కూడా తొలగించాలని వారు కోరారు.

## యంత్రాలు లేకుండా ఉత్పత్తి పెంపు అసాధ్యం



ఉక్కు పోరాట దీక్షలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కులో పూర్తి స్థాయి ఉత్పత్తి సాధనకు అవసరమైన పరిస్థితులు కల్పించాలని సీఐటీయూ అధ్యక్షుడు వై.పి.దాస్ డిమాండ్ చేశారు. అందుకు అనుగుణంగా అంచనాలు వేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ కర్మాగారంలో యంత్ర సామగ్రి లేకుండా ఉత్పత్తి పెంచేందుకు ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. అలా యాజమాన్యం కృషి చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. గతంలో ఎస్ఎంఎస్ – 2లో జరిగిన ఘోర ప్రమాదమే ఇందుకు ఉదాహరణ అన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రామస్వామి మాట్లాడుతూ యాజమాన్యం వైఖరి మార్చుకోవాలని అన్నారు. శిబిరంలో గంగాధర్, భానుమూర్తి, మరిడయ్య, సత్యనారాయణ, ప్రసాద్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సౌకర్యం కొనసాగించాలి



ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు, నాయకులు



స్టీల్‌ప్లాంట్ సీజీఎం గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల మెడికల్ సౌకర్యం యథావిధిగా కొనసాగించాలని ఉక్కు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, అధికారుల సంఘం, వివిధ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై గురువారం ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నా చేశారు. పాత పద్ధతి కొనసాగించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 40 ఏళ్లు కష్టపడి పని చేసిన రిటైర్డ్ ఉద్యోగులకు రూ.1500 నుంచి రూ. 2500 మాత్రమే పెన్షన్ లభిస్తుందన్నారు. వారికి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి ఆదుకోవాల్సిన యాజమాన్యం ఉన్న సదుపాయాలు తొలగించాలనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రీమియం రూ.1300 స్థానంలో రూ.10 వేలు చెల్లించాలని, అదేవిధంగా రూ.8 వేలు ఉన్న ఓపీ రీయింబర్స్‌మెంట్‌ను రూ.4 వేలకు కుదించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వెంటనే యాజమాన్యం ఆ ప్రతిపాదన విరమించుకుని పాత పద్ధతి కొనసాగించాలని కోరారు. అనంతరం హెచ్ఆర్ సీజీఎం జి.గాంధీకి వినతిపత్రం అందజేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు, దాడి శివరామ్, ఎం.ఎ.మాధవరావు, కోరాడ అప్పారావు, డి.ఆదినారాయణ, ఎస్.రామారావు, అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, దీనబంధు, పరమట సత్యనారాయణ, పైడిరాజు, డి.వి.రమణారెడ్డి, సన్యాసిరావు, బాలభాస్కరరావు, బి.వెంకటరావు, పరంధామయ్య, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 34 మంది విద్యార్థులకు కంటి అద్దాల అందజేత



కంటి అద్దాలు అందుకున్న విద్యార్థులతో హెచ్ఎం కాంతం, ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం : జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 34 మంది విద్యార్థులకు హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం గురువారం కంటి అద్దాలు అందజేశారు. అంధత్వ నివారణంలో భాగంగా గాజువాక పీహెచ్‌సీ డాక్టర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇటీవల కంటి పరీక్షలు నిర్వహించారు. ఆ సమయంలో 34 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని నిర్ధారించి అందజేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, ఉపాధ్యాయుడు కుమారస్వామి, పీడీ ఇస్మాయిల్, ఏఎన్ఎం సీహెచ్.మహాలక్ష్మి పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధి పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఐజీ కాలనీ -1,2, లేబర్ జంక్షన్ ఏరియా, హనుమాన్ సంజీవ్ కాలనీ, కొత్త నక్కవానిపాలెం, వాయుపుత్రకాలనీ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

## పురాతన భాష తమిళం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీజేపీ తమిళనాడు ఉపాధ్యక్షుడు నాగరాజన్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతంపేట : భారతీయ భాషా సమితి, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, కాసి తమిళ్ సంఘం సంయుక్తంగా సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల తమిళ కళా మందిరంలో గురువారం 'మహర్షి అగస్త్య'పై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ తమిళనాడు ఉపాధ్యక్షుడు కారు నాగరాజన్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగస్త్య మహర్షికి భగవాన్ శివుడు మొదటి భాషను నేర్పించారని, దానిని సరిగా వ్యాకరణం చేసి ప్రపంచానికి అందించారన్నారు. అందువల్ల సరైన సవరణలు, లోతైన అర్థాలతో కూడిన పురాతన భాషగా తమిళం పరిగణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎస్.ఎన్.రాజు, తమిళ పాల్గొన్నారు.

# ఎన్నాళ్లీ ట్రాఫిక్ కష్టాలు?

- సేవామార్గంలో కంటైనర్లతో ఒకటే రద్దీ
- రాత్రి వేళ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- గంటల కొద్దీ నరకయాతన



ములగాడ నుండి మారుతీ సర్కిల్‌కు వెళ్లే మార్గంలో నిలిచిపోయిన వాహనాలు



మారుతీ సర్కిల్ వద్ద ట్రాఫిక్ జామ్

మల్కాపురం: ప్రతి రోజు సాయంత్ర పూట గంటల తరబడి ఇక్కడి సేవా మార్గంపై వాహనాలు నిలిచిపోతుంటాయి. గత నాలుగు నెలలుగా ఈ సమస్య ఉన్నా ట్రాఫిక్ అధికారులు పూర్తిస్థాయి పరిష్కారం చూపటం లేదని వాహన చోదకులు విమర్శిస్తున్నారు. డాక్‌యార్డ్ నుండి వీడీఆర్ గొడౌన్స్, మారుతీ సర్కిల్ మీదుగా నగరానికి చేరుకునే సేవా మార్గం.. అలాగే ములగాడ విలేజీ నుండి మారుతీ సర్కిల్ మీదుగా నగరానికి చేరుకునే మార్గంలో సాయంత్రం ఆరు నుండి రాత్రి పది వరకు తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ములగాడ గ్రామానికి అతి చేరువలో శ్రావణి షిప్పింగ్ అనే సంస్థ ఉంది. ఈ సంస్థకు పోర్టు నుండి, ఇతర ప్రదేశాల నుండి వందల సంఖ్యలో కంటైనర్లు వస్తుంటాయి. లోడింగ్, అన్‌లోడింగ్ కోసం ఈ కంటైనర్లు మారుతీ సర్కిల్ వద్ద సేవా మార్గంపై గంటల కొద్దీ నిలిపేస్తుంటారు. ఆ సమయంలో మల్కాపురం, నౌసేనాభాగ్, న్యూకాలనీ, సింధియా తదితర ప్రాంతాలకు చెందిన వారు, అలాగే వివిధ పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థల్లో పని చేసేవారు, విద్యార్థులు తదితరులు నగరానికి వెళ్లాలన్నా, లేదా అక్కడి నుంచి ఇటు రావాలన్నా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇంతకు ముందు డాక్‌యార్డ్ వద్ద సర్దార్ వల్లభాయి పటేల్ వంతెన ఉండేది. దీనిని మరమ్మతుల నిమిత్తం 7 నెలల క్రితం మూసేశారు. దీంతో పారిశ్రామిక ప్రాంతవాసులు మారుతీ సర్కిల్ మీదుగా నగరానికి చేరుకోవాల్సి వస్తుంది. దీంతో వారు ఇక్కడి ట్రాఫిక్ కష్టాలను ఎదుర్కొంటున్నారు. దీనిపై ట్రాఫిక్ అధికారులు దృష్టి పెట్టి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వాహన చోదకులు ఆశిస్తున్నారు.

**చాలా ఇబ్బందిగా ఉంది..**



ములగాడ విలేజీ ద్వారా నగరానికి చేరుకుందామని నేను ఇటీవల రాత్రి 7 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణించాను. అయితే తీవ్రమైన ట్రాఫిక్ వల్ల సుమారు గంటన్నర పాటు ఎటూ కదల్లేకపోయాను. దీంతో చాలా అసౌకర్యానికి గురయ్యాను. చేసేది లేక గాజువాక మీదుగా హైవేపై నగరానికి చేరుకోవాల్సి వచ్చింది.

– లక్కరాజు రామకృష్ణ, ద్విచక్ర వాహన చోదకుడు

**రోజూ ఆలస్యంగానే ఇంటికి..**



నగరంలో గల ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్ చేస్తున్నాను. కళాశాల నుండి మల్కాపురం వచ్చేటప్పుడు మారుతీ సర్కిల్ మీదుగా కళాశాల బస్సుపై వస్తుంటాను. అయితే మారుతీ సర్కిల్ వద్ద గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుండటంతో రోజూ ఇంటికి ఆలస్యంగా రావాల్సి వస్తోంది. దీనిపై అధికారులు స్పందించాలి.

– ఏదుర విక్రమ్ యాదవ్, ఇంజినీరింగ్ విద్యార్థి

## చదువుతో పాటు నైపుణ్యమూ అవసరమే



పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

సీతంపేట : విద్యార్థులు చదువుతో పాటు ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకునేలా ఇతర నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎంపీ శ్రీభరత్ సూచించారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, పబ్లిక్ లైబ్రరీ సంయుక్తంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 'కమింగ్ టుగెదర్ ఫర్ డిసెమినేషన్ ఆఫ్ నాలెడ్జ్' అంశంపై గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఎవరైనా ఏ రంగంలోనైనా సక్సెస్ కావాలంటే ముందుగా వారు ఎంత కష్టపడటానికైనా సిద్ధంగా ఉండాలన్నారు. చివరి వరకు పోరాడుతూ ఉండాలని, మనలోని లోపాలను ఎవరైనా చెప్పినప్పుడు పాజిటివ్‌గా తీసుకుని బలహీనతలను సరిదిద్దుకుని విజయాలను అందుకోవాలని సూచించారు. సమాజంలో మార్పు కోరుకునే వారు ముందుగా తాము మారాలని, అప్పుడే మార్పు సాధ్యమన్నారు. వ్యక్తిగత క్రమశిక్షణతోనే సమాజంలో మంచి మార్పు వస్తుందని తెలిపారు. ముందుగా గ్రంథాలయలయంలోని అన్ని విభాగాలను, పుస్తకాలను, ఉద్యోగార్థులకు కల్పించిన సదుపాయాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మియావాకీ చిన్న పిల్లల విభాగంలో కథకులు సీతా శ్రీనివాస్ పిల్లలకు కథ చెబుతున్న కార్యక్రమంలో భరత్ పాల్గొని అభినందించారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, పౌరగ్రంథాలయం కార్యదర్శి డి.ఎస్.వర్మ, కోశాధికారి కె.వి.గుప్త, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు

ఆరిలోవ: పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న టెన్త్ విద్యార్థులు ప్రణాళితో చదవాలని డీఈవో ప్రేమ్‌కుమార్ సూచించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సాయంత్రం ఆయన సందర్శించారు. స్టడీ అవర్‌లో ఉన్న టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు ఏవిధంగా చదవాలో తెలిపారు. క్రమశిక్షణ, ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ, పాఠశాల హెచ్ఎం భవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.